VEGA
JEWELLERS
దివిలోనైనా... భువిలోనైనా.. వేగ తోడుంటే
వివాహం వైభోగం అవుతుంది.
ఆంధ్రప్రదేశ్ | తెలంగాణ | USA
follow us vegajewellers

RNI NO : APTEL/2016/69464

# కలం కౌంటర్

KALAM COUNTER TELUGU DAILY

తెలుగు దినపత్రిక

సంపుటి : 10 సంచిక : 88

పేజీలు : 4 వెల రూ.4/-

Circulated by : Krishna, Guntur, Prakasam, Nellore, West Godavari, Khammam, Hyderabad, Chittor

బుధవారం 2 సెప్టెంబర్ 2026



# పేదల ఆర్థిక సాధికారతే లక్ష్యం

● సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనతో ముందుకు ● నదుల అనుసంధానంతో నీటి సమస్యకు పరిష్కారం ● గత పాలకులు బటన్ నొక్కారు.. రోడ్లకు గుంతలు పెట్టారు ● ఓటమి భయంతోనే గొడ్డలి పార్టీ ఏకగ్రీవాలు వద్దంటోంది ● నర్సాపురం పేదల సేవలో ప్రజా వేదిక సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు




**నర్సాపురం,కలంకౌంటర్ :** పేదల ఆర్థిక సాధికారతే లక్ష్యంగా సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనకు సమ ప్రాధాన్యం ఇస్తూ కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. నర్సాపురం నియోజకవర్గం మొగల్తూరులో మంగళవారం నిర్వహించిన పేదల సేవలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. 31 ఏళ్ల క్రితం సెప్టెంబరు 1న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా తొలిసారి ప్రమాణ స్వీకారం చేశానని చంద్రబాబు గుర్తుచేశారు. అప్పటి నుంచి ఇప్పటివరకు అనేక సంస్కరణలకు శ్రీకారం చుట్టడంతో పాటు ప్రజా చైతన్యం, ప్రజా భాగస్వామ్యం కోసం అనేక కార్యక్రమాలు అమలు చేశామని తెలిపారు. పేదలు ఆర్థిక ఇబ్బం దులు పడకూడదనే ఉద్దేశంతో ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు అందిస్తున్నా మని సీఎం చెప్పారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఇతర వర్గాలకు పెంచిన పెన్షన్లు అందిస్తున్నామని తెలిపారు. ఇప్పటివరకు రూ.73,507 కోట్లను పెన్షన్ల రూపంలో పేదలకు అందించామని చెప్పారు. రెండేళ్లలో సంక్షేమ కార్యక్రమాల కోసం రూ.1.50 లక్షల కోట్లు ఖర్చు చేశామని వెల్లడించారు. అభివృద్ధితో పాటు సంక్షేమానికి కూడా సమ ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు.



**మహిళా సాధికారతకు పెద్దపీట..** డ్వాక్రా సంఘాల ద్వారా పొదుపు ఉద్యమానికి శ్రీకారం చుట్టి మహిళా సాధికారతకు బాటలు వేశామని చంద్రబాబు అన్నారు. ఏ ఆడబిడ్డా వంట కోసం ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో దీపం పథకాన్ని తీసుకొచ్చామని, ఇప్పుడు దీపం-2.0 ద్వారా ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు అందిస్తున్నామని తెలిపారు. మహిళలు అన్ని రంగాల్లో అగ్రగామిగా ఉండాలనే ఉద్దేశంతో 33 శాతం రిజర్వేషన్లు కల్పించామని చెప్పారు. గత ఏడాది లక్ష మంది డ్వాక్రా మహిళలు ఎంఎస్ఎంఈలుగా ఎదిగారని, ఈసారి లక్ష్యాన్ని మరింత పెంచామని తెలిపారు. డ్వాక్రా మహిళలు తయారు చేసిన ఉత్పత్తులకు స్వయం బ్రాండ్ ద్వారా మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తామని వెల్లడించారు. ఎస్సీలు, ఎస్టీలు, మైనారిటీల్లో ఇంకా ఆర్థిక, సామాజిక వెనుకబాటుతనం ఉందని సీఎం పేర్కొన్నారు. వెనుకబడిన వర్గాలను ఆర్థికంగా, సామాజికంగా ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. వడ్డెర్లకు మైనింగ్‌లో, గీత కార్మికులకు మద్యం దుకాణాల్లో రిజర్వేషన్లు కల్పించామని చెప్పారు. మత్స్యకారులకు వేట నిషేధ సమయంలో రూ.20 వేల ఆర్థిక సాయం అందిస్తున్నామని, చేనేత కార్మికులకు ఉచిత విద్యుత్ ఇస్తున్నామని తెలిపారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఎస్సీ వర్గీకరణను అమలు చేసి న్యాయం చేశామని చెప్పారు. గిరిజన ప్రాంతాల విద్యార్థులకు శిక్షణ ఇచ్చి పోటీ పరీక్షలు, ఐఐటీ, ఐఐఎం వంటి ఉన్నత విద్యా అవకాశాలకు పంపిస్తున్నామని తెలిపారు.

**బటన్ నొక్కడం కాదు.. ఇంటింటికీ వచ్చి పెన్షన్..** బటన్ నొక్కడం కాదు.. ఇంటింటికీ వచ్చి పెన్షన్ ఇస్తున్నాం అని చంద్రబాబు అన్నారు. రాష్ట్రంలో గుంతలు లేని రహదారులు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. స్త్రీశక్తి కార్యక్రమం ద్వారా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించి ఆర్థికంగా వెసులుబాటు కలిగించామని చెప్పారు. గ్రామంలో ఇంకా పేదలు ఉన్నారంటే ఆ గ్రామానికే అవమానమని వ్యాఖ్యానించారు. ఆర్థిక అసమానతలు తగ్గించి ప్రతి ఒక్కరూ గౌరవప్రదమైన జీవితం గడిపేలా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. పీ4 ద్వారా జీవన ప్రమాణాలు పెంచేందుకు ప్రయత్నిస్తున్నామని అన్నారు. వెలిగొండ ప్రాజెక్టు ద్వారా కరవు నేలకు కృష్ణా జలాలు అందించామని చంద్రబాబు తెలిపారు.

# జిల్లా కలెక్టర్లకు రెడ్ క్రాస్ అవార్డులను అందజేసిన గవర్నర్ అబ్దుల్ నజీర్






**విజయవాడ,కలంకౌంటర్ :** ఆంధ్రప్రదేశ్ గవర్నర్, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాఖ గౌరవ అధ్యక్షుడు ఎస్ అబ్దుల్ నజీర్ మంగళవారం తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన ఐఆర్‌సీఎస్ 2024-25 వార్షిక సర్వసభ్య సమావేశంలో బాపట్ల, కృష్ణా, నెల్లూరు, కాకినాడ, పశ్చిమగోదావరి, నంద్యాల, శ్రీకాకుళం జిల్లాల కలెక్టర్లకు రెడ్‌క్రాస్ అవార్డులను అందజేశారు. రెడ్‌క్రాస్ వివిధ ప్రధాన మానవతా సేవా కార్యక్రమాలను చేపట్టేందుకు వనరులను సమీకరించడంలోనూ విశిష్ట సహకారం అందించినందుకు జిల్లా కలెక్టర్లను గవర్నర్ అబ్దుల్ నజీర్ అభినందించారు. రెడ్‌క్రాస్ అవార్డులు పొందిన ఇతర సంస్థలను, అధికారులను కూడా గవర్నర్ అభినందించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ, తలసేమియా రోగులకు ఆరోగ్య సంరక్షణ అందించేందుకు సంకల్ప్ ఫౌండేషన్, రోటరీ ఇంటర్నేషనల్‌తో పాటు ఎల్ఎన్4 టాంజియన్స్ ఆర్గనైజేషన్, నిరుపేదలకు కృత్రిమ చేతులను అందించడంలోను, ఎల్‌వి ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ ఫర్ కార్నియా కలెక్షన్ కోసం ఎల్‌వి ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ (ఎల్‌వి ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ ఫర్ లాకోటిక్ యాంటి-ఎన్ఇఎ) కోసం సంకల్ప్ ఫౌండేషన్ సహకారం, డ్రగ్స్ ఫ్రీ ఆంధ్రప్రదేశ్ కోసం యువతలో చైతన్యం తీసుకురావడానికి రెడ్ క్రాస్ కృషిని అభినందించారు. అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం, నంద్యాల, పల్నాడు, తిరుపతి, అంబేద్కర్ కోనసీమ ఇంకా పశ్చిమ గోదావరి మొదలగు ఏడు జిల్లాల పరిధిలో మూడేళ్లుగా రూ.8.50 కోట్లతో రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్ వారి సహకారంతో 'మీ ఇంటికి మీ డాక్టర్' పథకం కింద 5 లక్షల కుటుంబాలను దత్తత తీసుకుని రెడ్‌క్రాస్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. దేశ జనాభాలో మూడింట ఒక వంతు కంటే ఎక్కువ మంది యువత ఉన్నందున, భారతదేశం



100 సంవత్సరాల స్వాతంత్ర్యం జరుపుకునే సమయానికి విక్షిత్ భారత్ మరియు స్వర్ణ ఆంధ్ర ఏ2047ని నిర్మించడంలో వారు కీలక పాత్ర పోషించాలని ఆయన అన్నారు. రాష్ట్రంలోని అన్ని కళాశాలలు/విశ్వవిద్యాలయాలలో యూత్ రెడ్‌క్రాస్ యూనిట్‌లను ఏర్పాటు చేయాలని, అకడమిక్ పాఠ్యాంశాల్లో రెడ్‌క్రాస్‌ను అనుసంధానం చేయాలని, యూత్ రెడ్‌క్రాస్ కార్యక్రమానికి అత్యధిక ప్రాధాన్యతనిచ్చి దేశంలోనే ఆదర్శంగా నిలిచేందుకు జిల్లా కలెక్టర్ల సహాయాన్ని కోరాలని గవర్నర్ రాష్ట్రంలోని రాష్ట్ర, కేంద్రీయ విశ్వవిద్యాలయాల వైస్ ఛాన్సలర్లను కోరారు. రెడ్‌క్రాస్ ప్రారంభించిన ఏపీ క్లైమేట్ యాక్షన్ క్యాంపెయిన్ మరియు సింగల్ యూస్ ప్లాస్టిక్ వ్యతిరేక క్యాంపెయిన్‌లో రెడ్‌క్రాస్ వాలంటీర్లు మరియు రాష్ట్రంలోని ప్రతి ఒక్కరూ చురుకుగా పాల్గొనాలని గవర్నర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి ప్రధాన కార్యదర్శి & ముఖ్య కార్యనిర్వహణాధికారి అశ్విని కుమార్ పరిదా, యం.డి. రామారావు, చైర్మన్ పి.రామచంద్రరాజు, వైస్ చైర్మన్, డాక్టర్ డి.శ్రీహరిరావు, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, ఎ.పి. రాష్ట్ర శాఖ కోశాధికారి, ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

# గోదావరి తీరానికి అభివృద్ధి హారతి

● రూ.100 కోట్లు మంజూరు చేయించిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ● రూ.90 కోట్ల పంచాయతీరాజ్ నిధులతో ఏడు నియోజకవర్గాల్లో రహదారుల అభివృద్ధి ● తాగు నీటి సరఫరా కోసం ఆర్‌డబ్ల్యూఎస్ నుంచి మరో రూ.10 కోట్లు ● ఇప్పటికే ఏపీపీసీబీ ద్వారా రూ.100 కోట్లు కేటాయించిన ఉప ముఖ్యమంత్రి.



**అమరావతి,కలంకౌంటర్ :** 'స్వచ్ఛ గోదావరి -- పవిత్ర పుష్కరాలు' అనే థీమ్‌తో గోదావరి నది పరివాహక ప్రాంతంలోని గ్రామాల్లో ప్రత్యేక అభివృద్ధి కార్యక్రమాలను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ ముందుకు తీసుకెళ్తున్నారు. గోదావరి పుష్కరాల సందర్భంగా మూడు జిల్లాల పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో అభివృద్ధి పనుల కోసం పంచాయతీరాజ్, గ్రామీణ తాగు నీటి సరఫరా (ఆర్‌డబ్ల్యూఎస్) శాఖల ద్వారా రూ.100 కోట్ల నిధులను విడుదల చేశారు. గతంలో ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి (ఏపీపీసీబీ) ద్వారా విడుదల చేసిన రూ.100 కోట్లకు ఇవి అదనం. ఈ నిధులతో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ, పశ్చిమ గోదావరి, పోలవరం ప్రాంతాల పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో రూ. 90 కోట్లతో 111 పనులను చేపట్టనున్నారు. వీటి ద్వారా సుమారు 141 కిలోమీటర్ల మేర సీసీ, బీటీ రహదారుల నిర్మాణం చేపడతారు. రూ.10 కోట్లతో.. పుష్కరాలకు వచ్చే భక్తులకు రక్షిత తాగునీటి సదుపాయాలు కల్పించనున్నారు. గోదావరి పరివాహక ప్రాంతంలోని రాజోలు, పి. గన్నవరం, రామచంద్రపురం, రంపచోడవరం, ఆచంట, నరసాపురం, పాలకొల్లు తదితర నియోజకవర్గాల్లో గ్రామాల నుంచి పుష్కర ఘాట్లకు వెళ్లే మార్గాల్లో బీటీ, సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టనున్నారు. అవసరమైన చోట గ్రామాల్లో అంతర్గత రహదారులను కూడా అభివృద్ధి చేయనున్నారు. గోదావరి పుష్కరాలను కేవలం రాజమహేంద్రవరం వంటి ప్రధాన కేంద్రాలకే పరిమితం చేయకుండా, పవిత్ర నదీ పరివాహక ప్రాంతంలోని ప్రతి గ్రామంలో భక్తులు పుష్కర స్నానాలు, పూజలు, పితృదేవతలకు తర్పణాలు నిర్వహించుకునేలా అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించాలనే లక్ష్యంతో ఈ పనులు చేపడుతున్నారు.

**ప్రతి పుష్కర ఘాట్‌లో రక్షిత తాగు నీటి సదుపాయాలు..** గ్రామీణ రహదారులతో పాటు ప్రతి పుష్కర ఘాట్‌లో రక్షిత తాగు నీటి సరఫరా బాధ్యతలను కూడా గ్రామీణ తాగునీటి సరఫరా విభాగం ద్వారా చేపట్టేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే పవన్ కళ్యాణ్ రూ.7 కోట్ల వ్యయంతో రాజమహేంద్రవరం గ్రామీణ నియోజకవర్గ పరిధిలోని మునికూడలిని 'మోడల్ పుష్కర పంచాయతీ'గా అభివృద్ధి చేస్తున్నారు. సప్త ఋషి ఘాట్‌కు సకల హంగులు కల్పించే పనులు వేగంగా కొనసాగుతున్నాయి. ఈ అభివృద్ధి కార్యక్రమాల్లో సీసీ రహదారుల నిర్మాణం, టవర్ లైట్ల ఏర్పాటు, మునికూడలి గ్రామంలో మ్యాజిక్ డ్రెయిన్లు, ఇంకుడు గుంతల నిర్మాణం, పుష్కర ఘాట్ల వద్ద మరుగుదొడ్ల నిర్మాణం వంటి పనులు పూర్తికావస్తున్నాయి.

**ఏపీపీసీబీ నిధులతో సమగ్ర అభివృద్ధి..** కాలుష్య నియంత్రణ మండలి ద్వారా కేటాయించిన రూ.100 కోట్లను ఆయా జిల్లాల నుంచి అందిన ప్రతిపాదనల ఆధారంగా ప్రాధాన్య క్రమంలో వినియోగించనున్నారు. పోలవరం, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాల పరిధిలో ప్రతిపాదిత అభివృద్ధి పనుల కోసం ఈ నిధులను వినియోగించి గోదావరి పుష్కరాలను మరింత సౌకర్యవంతంగా, పరిశుభ్రంగా నిర్వహించేలా చర్యలు చేపడుతున్నారు.

# సత్ఫలితాలిస్తున్న అక్షర ఆంధ్ర... వచ్చేఏడాదికి సంపూర్ణ అక్షరాస్యత దిశగా అడుగులు!

● అక్షర ఆంధ్రలో శాసనసభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేయండి ● బడిబయట పిల్లలను పాఠశాలల్లో చేర్పించేలా అధికారులు చొరవ చూపాలి ● మధ్యాహ్న భోజన పథకంపై తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఫీడ్ బ్యాక్ అందించాలి ● పాఠశాల విద్య, ఇంటర్మీడియట్ విద్య శాఖలపై మంత్రి నారా లోకేష్ సమీక్ష



**అమరావతి,కలంకౌంటర్ :** రాష్ట్రంలో గత ఏడాది చేపడుతున్న అక్షర ఆంధ్ర కార్యక్రమం సత్ఫలితాలనిస్తోంది. ఉద్యమం లా పనిచేసి వచ్చే ఏడాది సెప్టెంబర్ నాటికి సంపూర్ణ అక్షరాస్యత సాధనకు అధికారులంతా కలసికట్టుగా కృషిచేయాలని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ దిశానిర్దేశం చేశారు. ఉండవల్లి నివాసంలో పాఠశాల విద్య, ఇంటర్మీడియట్ విద్య శాఖ ఉన్నతాధికారులతో మంత్రి లోకేష్ సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ... 2024నాటికి రాష్ట్రంలో అక్షరాస్యత శాతం దేశంలోనే అట్టడుగున కేవలం 72.6శాతం ఉండగా, గత ఏడాదిగా కూటమి ప్రభుత్వం చేపట్టిన చర్యల కారణంగా 25లక్షలమంది అక్షరాస్యులుగా మారారు, ఒక్క ఏడాదిలో ఇంత భారీగా అక్షరాస్యత సాధించడంపై ఎపి కృషిని కేంద్రప్రభుత్వం అభినందించినట్లు అధికారులు తెలుపగా, మంత్రి లోకేష హర్షం వ్యక్తంచేశారు. ఇటీవల కేంద్రం విడుదల చేసిన వయోజన విద్య పరీక్షా ఫలితాల్లో 10శాతం పెరిగి 82.1శాతానికి చేరుకుంది, 2027 సెప్టెంబర్ నాటికి నూరుశాతం అక్షరాస్యత సాధన దిశగా పనిచేయాలని మంత్రి కోరారు. 2027 మార్చినాటికి మరో 25లక్షలమందిని, సెప్టెంబర్ నాటికి మిగిలిన 27లక్షలమంది అక్షరాస్యులుగా మార్చేందుకు ప్రణాళికలు రూపొందించినట్లు అధికారులు చెప్పారు. ఇందుకోసం 11 ప్రభుత్వశాఖల సమన్వయంతో పనిచేస్తున్నట్లు తెలిపారు. అక్షర ఆంధ్ర కార్యక్రమంలో శాసనసభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేసి, పెద్దఎత్తున ప్రజలను చైతన్యవంతం చేయాలని మంత్రి సూచించారు. ఈ ఏడాది ఇంటర్మీడియట్ రెండో సంవత్సరంలో మంచి ఉత్తీర్ణత సాధించామని ఇంటర్మీడియట్ విద్య కమిషనర్ రంజిత్ బాషా అన్నారు. గత ఏడాదితో పోలిస్తే ఈ సంవత్సరం ఇంటర్మీడియట్ లో సుమారు 10వేల అడ్మిషన్లు పెరిగాయని తెలిపారు. సంకల్ప్ అకడమిక్ సపోర్ట్ ప్రోగ్రామ్ కింద వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేకంగా క్లాసులు నిర్వహించేలా రూట్ మ్యాప్ రూపొందించామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఈ ఏడాది తల్లికి వందనం పథకం ద్వారా ఇప్పటికే రూ.1051 కోట్ల మేర ఆర్థిక సాయం అందించగా, మొదటి సంవత్సరం విద్యార్థులకు త్వరలో అందించేందుకు చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. ఇంటర్మీడియట్ విద్యార్థులకు సంబంధించి నూరుశాతం అపార్ ఐడి ఇంటిగ్రేషన్ చేపట్టేలా చర్యలు తీసుకోవాలని మంత్రి లోకేష్ ఆదేశించారు.

# జగన్ అధికారంలో ఉంటే ఒకలా ప్రతి పక్షంలో ఉంటే ఇంకోలా: అర్వపల్లి



**అమరావతి, కలంకౌంటర్ :** నాడేమో ఏక గ్రీవాలు చేయక పోతే టికెట్ ఇవ్వనని నేడెమోఏకగ్రీవాలు జరిగితే టికెట్ ఇవ్వనని జగన్ మాట్లాడడం విడ్డూరంగా ఉందని రాష్ట్ర టిడిపి అధికార ప్రతినిధి ఆంజనేయులు విమర్శించారు.రాష్ట్రపతి ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో ఏక గ్రీవాలు అవుతున్నప్పు డు స్థానిక ఎన్నికల్లో ఏక గ్రీవాలు అయితే తప్పేమీ అని నాడు వైసిపి నాయ కులు అడ్డంగా వాదించారని నేడెమో ఏకగ్రీవాలు జరగటా నికి వీలు లేదుఅంటున్నారు 2021 స్థానిక సంస్థలు ఎన్నిక ల్లో అధికార దుర్వినియోగం అరాచకలు చేసి అనేక అక్ర మాలకు పాల్పడి దేశ చరిత్ర లోనే లేని విధంగా బలవంత పు ఏకగ్రీవాలు చేయించిన వైసిపి ప్రభుత్వం రాష్ట్రంలో 660 జెడ్పీ టీసీలకు గాను 126. 9696 ఎంపీటీసీ లకు గాను 2371.13097 గ్రామ పంచా యతీలకు గాను 2196. 2711 మున్సిపల్ వార్డులు డివిజన్లకు గాను 590ని బలవంతంగా ఏక గ్రీవం చేసి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారని నాడు ప్రతి పక్ష పార్టీ టిడిపి వారి నామి నేషన్ పత్రాలు సక్రమంగా ఉన్న అధికారాన్ని అడ్డం పెట్టుకొని వాటిని తిరస్కరిం చడం కొన్ని చోట్ల బలవంతం గా చించివేయడం జరిగిందని మరికొన్ని చోట్ల పోటీలోఉన్న అభ్యర్థులు మీద దొంగ కేసు లు పెట్టించి వారిని అరెస్టు చేయించి పోలీస్ స్టేషన్లకు తీసుకెళ్లి బలవంతంగా నామినేషన్ ఉపసంహరణ పత్రాలు పై సంతకాలు తీసు కొని ఏక గ్రీవంచేసుకున్నారని కడప. కర్నూలు. దెందులూరుమాచర్ల. పుంగనూరు. లాంటి చోట్ల దాడులకు పాల్పడి భయ భ్రాంతులకు గురిచేసి నామినేషన్లు వేయకుండా అడ్డుకున్నారని ఆంజనేయు లు గుర్తు చేశారు.

# మహిళా శక్తికి కలెక్టర్ నాగరాణి నిదర్శనం: సీఎం చంద్రబాబు



**మొగల్తూరు,కలంకౌంటర్ :** మహిళలు ఏ బాధ్యతనైనా సమర్థంగా నిర్వర్తించగలరని నిరూపిస్తూ పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నారని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రశంసించారు. జిల్లా అభివృద్ధి, ప్రజా సంక్షేమ కార్యక్రమాల అమలులో ఆమె పురుష కలెక్టర్‌తో సమానంగా సమర్థవంతంగా పనిచేస్తున్నారని అభినందించారు. మొగల్తూరులో నిర్వహించిన 'పేదల సేవలో ప్రజా వేదిక' కార్యక్రమంలో కలెక్టర్ నాగరాణి పనితీరును సీఎం ప్రత్యేకంగా ప్రస్తావించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ, జిల్లా అభివృద్ధి కోసం ఆమె చూపిస్తున్న చొరవ, అంకిత భావం, సమర్థత అభినందనీయమన్నారు. మహిళల్లో అపారమైన శక్తి, ప్రతిభ, సామర్థ్యం ఉన్నాయని, వాటిని సరైన విధంగా వినియోగించుకుంటే ఉన్నత స్థాయికి ఎదగడంతో పాటు ప్రజాసేవలో మరింత గొప్ప ఫలితాలు సాధించవచ్చని చెప్పారు. కలెక్టర్ నాగరాణి పనితీరు మహిళా సాధికారతకు ఒక మంచి ఉదాహరణగా నిలుస్తోందని చంద్రబాబు అన్నారు. ఆమెను స్ఫూర్తిగా తీసుకుని మహిళలు అన్ని రంగాల్లో మరింత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. సమర్థత, అంకితభావంతో పనిచేసే మహిళలు ఎలాంటి కీలక బాధ్యతనైనా విజయవంతంగా నిర్వహించగలరని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి స్వయంగా కలెక్టర్ పనితీరును ప్రశంసించడంపై జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాల ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.

# పార్టీలకతీతంగా అభివృద్ధి, సంక్షేమం

● మాచవరంలో రెండేళ్లలో 17.35 కోట్లతో కార్యక్రమాలు ● ఓట్లు వేయకపోయినా... అభివృద్ధి చేసి చూపిస్తా ● మాచవరంలో పెన్షన్ల పంపిణీ, ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే నాగేశ్వరరావు



**కందుకూరు,కలంకౌంటర్ :** కూటమి ప్రభుత్వంలో పార్టీలకతీతంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామని కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. మంగళవారం కందుకూరు మండలంలోని మాచవరం గ్రామంలో... ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ, రెండేళ్ల నమ్మకం - అభివృద్ధి, సంక్షేమం కార్యక్రమంలో భాగంగా ఇంటింటి ప్రచారంలో ఎమ్మెల్యే నాగేశ్వరరావు పాల్గొన్నారు.గ్రామ శివారులోని ఎస్టీ కాలనీ, కొండదగ్గర ఎస్టీ, బీసీ కాలనీల్లో వృద్ధులు, దివ్యాంగుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు అందజేయడంతో పాటు.... రాష్ట్రం, కందుకూరు నియోజకవర్గంలో గడచిన రెండేళ్లలో జరిగిన ప్రగతిని వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రెండేళ్ల కాలంలో మాచవరం పంచాయతీలో 17.35 కోట్ల రూపాయలతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసామని అన్నారు. తల్లికి వందనం, దీపం పథకం,సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా పార్టీలకతీతంగా 21 మంది పేదలకు 16.66 లక్షలు సహాయం అందించామని తెలిపారు.గ్రామంలో 10 లక్షలతో సీసీ రోడ్లు నిర్మించడంతోపాటు తాగునీటి వసతుల కోసం 6 లక్షలకు పైగా ఖర్చు చేసాం. సాగునీటి కోసం చెరువుకు వచ్చే కాలువ రిపేర్లు, పంట కాలువలు మరియు పాటి కాలువ అభివృద్ధి కోసం 14.5 లక్షలు మంజూరు చేసాం. రాజకీయాలలో మార్పును ఆహ్వానించాలని గ్రామస్తులను కోరుతున్నాను. భయం వదిలి బయటకు రండి. ఏ సమస్య ఉన్నా నేరుగా నా దగ్గరకు నేరుగా రావచ్చు. పనిచేయటానికి సిద్ధంగా ఉన్నాను.అని ఇంటూరి నాగేశ్వరరావు స్పష్టంగా చెప్పారు.ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు బుస్సారెడ్డి కృష్ణారెడ్డి, క్లస్టర్ ఇంచార్జ్ గొంది నరసింగరావు, స్థానిక నాయకులు సూరం చిరంజీవిరెడ్డి, సాదినేని మాల్యాద్రి, రావూరి మహేంద్ర, ఇనకల్లు సుబ్రహ్మణ్యం, అనంత రాగయ్య, శేషయ్య, పరుచూరి మాధవ, బీరం వాసు, లక్ష్మీనారాయణ, తన్నీరు అయ్యలు, చొప్పర మోహన్, ఎండ్లూరి శరత్, పలు గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

# ఆర్డీఓ వంశీకృష్ణ, రొటేరియన్ రమేష్ రెడ్డికి బంగారు పతకాలు






**కావలి,కలంకౌంటర్ :** ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర శాఖ 7వ సర్వసభ్య సమావేశం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఘనంగా జరిగింది.రెడ్ క్రాస్ ద్వారా ప్రజాసేవలో విశేష కృషి కనబరిచి నందుకు గాను అప్పటి ఆర్డీఓ, రెడ్ క్రాస్ అధ్యక్షులు ఎం. సన్నీ వంశీకృ ష్ణతో పాటు కావలి రెడ్ క్రాస్ పాలకమండలి సభ్యులు,రోటరీ క్లబ్ ఆఫ్ కావలి అధ్యక్షులు "అంకినపల్లి రమేష్ రెడ్డి"గవర్నర్ చేతుల మీదుగా బంగారు పతకాలు అందుకున్నారు. అవార్డు గ్రహీతలను రెడ్ క్రాస్ రాష్ట్ర చైర్మన్ వై.డి. రామారావు, ప్రధాన కార్యదర్శి అశ్వనికుమార్ పరిడా, వైస్ చైర్మన్ పి. రామచంద్రరాజు, కోశాధికారి డాక్టర్ డి. శ్రీహరి రావు ప్రత్యేకంగాఅభినందించారు. ఈ కార్యక్రమంలో అవార్డు గ్రహీతల కుటుంబ సభ్యులు, కావలి రెడ్ క్రాస్ చైర్మన్ డి.రవిప్రకాష్, జిల్లా పాలకమండలి సభ్యులు కలికి శ్రీహరి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సురేష్ కుటుంబాన్ని పరామర్శించిన మాజీ మంత్రి వెలంపల్లి



**కమలాపురం,కలంకౌంటర్ :** కమలాపురంలో కూటమి నాయకుల దాడికి గురైన వైఎస్సార్‌సీపీ కో–ఆప్షన్ మెంబర్, ఆర్యవైశ్య నాయకుడు సురేష్ కుటుంబాన్ని ఆర్యవైశ్య నాయకులు గుబ్బా చంద్రశేఖర్, కుప్పం ప్రసాద్, రేపాల శ్రీనివాసరావు, మిట్ట కరుణాకర్ మరియు స్థానిక వైసిపి నాయకులు కార్యకర్తలతో కలిసి మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు పరామర్శించారు. బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడి ఘటన వివరాలను అడిగి తెలుసుకున్న ఆయన, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ , వైఎస్ జగన్ మోహన్ రెడ్డి బాధితులకు పూర్తి అండగా ఉంటారని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు మీడియాతో మాట్లాడుతూ... ఫ్లైఓవర్ నిర్మాణంలో నష్టపోతున్న 100కు పైగా పేద కుటుంబాల తరపున నిలబడి నష్టపరిహారం కోరినందుకే సురేష్‌పై స్థానిక టీడీపీ ఎమ్మెల్యే, ఆయన తండ్రి అండతో కిడ్నాప్ చేసి దాడి చేశారని మండిపడ్డారు. రాఖీ పౌర్ణమి నాడు రామాలయం వద్ద ఉన్న వ్యక్తిని ఆటోలో కొట్టుకుంటూ ఎమ్మెల్యే కార్యాలయానికి తీసుకెళ్లి మ్యాన్‌హ్యాండ్లింగ్ చేయడం దారుణమని, సీసీ ఫుటేజీలు స్పష్టంగా ఉన్నా పోలీసులు పట్టించుకోకపోవడం సిగ్గుచేటని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## పెన్షన్ లు పంపిణీ





**మచిలీపట్నం, కలంకౌంటర్ :** స్థానిక 45 వ డివిజన్ లో పెన్షన్ లు పంపిణీ కార్యక్రమం లో కమిషనర్ సిహెచ్ వి వి బాపిరాజు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గొర్రెపాటి గోపీచంద్, స్టేట్ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పి వి ఫణికుమార్ పాల్గొన్నారు.

## శ్రీ వీరాంజనేయ స్వామి వారిని దర్శించుకున్న మాజీ మంత్రి వెలంపల్లి





**కడప జిల్లా,కలంకౌంటర్ :** వైఎస్సార్ కడప జిల్లా చక్రాయపేట మండలం, గండిక్షేత్రంలోని ప్రసిద్ధ శ్రీ శ్రీ శ్రీ వీరాంజనేయ స్వామి వారిని మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య నాయకులు గుబ్బ చంద్రశేఖర్, రేపాల శ్రీనివాసరావు, కుప్పం ప్రసాద్, మిట్టా కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు

## పెద్ద తుమ్మిడి పీహెచ్ సీ ని డి ఎం అండ్ హెచ్ ఓ ఆకస్మిక తనిఖీ



**బంటుమిల్లి,కలంకౌంటర్ :** జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ దయాకర్ మంగళవారం బంటుమిల్లి మండలం పెద్ద తుమ్మిడి పి హెచ్ సి నీ ఆకస్మిక తనిఖీ చేశారు. పి హెచ్సి లోని ఓపి రిజిస్టర్, ఫార్మసీ రికార్డ్, వ్యాక్సిన్ రికార్డు, కోల్డ్ చైన్ సిస్టం తదితర అన్ని రికార్డులను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు అన్నిటిని సక్రమంగా మెయిన్టైన్ చేయాలని డి ఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ దయాకర్ ఆదేశించారు. పీహెచ్సీకి వచ్చిన ప్రజలకు చక్కగా వైద్య సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్సీ వైద్యాధికారి డాక్టర్ కే సువర్చల, డాక్టర్ వి జయశ్రీ , ఎం పి హెచ్ ఈ ఓ ఏడుకొండలు, సూపర్వైజర్ ఎమ్ ఏసు దాస్, పీహెచ్ఎన్ పెద్ది ఈశ్వరి, హెల్త్ అసిస్టెంట్ బి రాజారావు చాన్ బీ, ఎల్. టి. ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు

## కూటమి ప్రభుత్వంలోనే అభివృద్ధి, సంక్షేమం

-ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాద రావు, ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్





**చిత్తూరు,కలంకౌంటర్ :** కూటమి ప్రభుత్వంలోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ పేర్కొన్నారు. మంగళవారం ఉదయం చిత్తూరు నియోజకవర్గం గుడిపాల మండలం చీలాపల్లి గ్రామంలో చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాద్ రావు,, ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ .. స్థానిక నాయకులతో కలిసి లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లను పంపిణీ చేశారు. లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి పింఛను సొమ్మును అందించి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం అంగన్వాడీ కేంద్ర భవనాన్ని ఎంపీ, ఎం ఎల్ ఎ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గోళ్ల హరి, చుడా చైర్ పర్సన్ కఠారి హేమలత, మొదలియార్ కార్పొరేషన్ చైర్మన్ త్యాగరాజన్, మాజీ ఎమ్మెల్సీ బీఎన్ రాజసింహులు, మండల పార్టీ అధ్యక్షుడు సుబ్బా నాయుడు, కూటమి నాయకులు సీకే లావణ్య, కుమారి, ధన సింగ్, బాలసుబ్రమణ్యం యాదవ్, ప్రతాప్ నాయుడు, రాజేష్ కుమార్ రెడ్డి, బాలాజీ నాయుడు, దీపశ్రీ అనిల్, సుమతి, పీటర్, హేమాద్రినాయుడు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## భద్రత , గంజాయి నిర్మూలనకు ప్రాధాన్యత కల్పించాలి - ఎస్పీ ఎ.ఆర్.దామోదర్





**విజయనగరం,కలంకౌంటర్ :** విజయనగరం జిల్లా గజపతినగరం, పోలీసు స్టేషను మరియు గజపతినగరం సర్కిల్ కార్యాలయంను జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ సందర్శించి, పోలీసు స్టేషన్ల పరిసరాలను పరిశీలించారు. క్షేత్ర స్థాయిలో మహిళల భద్రత, గంజాయి నిర్మూలనకే అధిక ప్రాధాన్యత కల్పించే విధంగా రక్షణ, నియంత్రణ చర్యలు చేపట్టాలని పోలీసు అధికారులు, సిబ్బంది జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ ఆదేశించారు. పోలీసు సిబ్బంది లేదా సర్కిల్ కార్యాలయానికి వచ్చిన ప్రజలు వేచి ఉండేందుకు గజపతినగరం సర్కిల్ కార్యాలయంలో నూతనంగా నిర్మించిన వెయిటింగ్ రూమును జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ ప్రారంభించారు.

## అట్టహాసంగా డైరెక్టర్ "నరేంద్ర బాబు" జన్మదిన వేడుకలు..





**కందుకూరు,కలంకౌంటర్ :** పట్టణంలోని స్థానిక బి.ఆర్.ఆక్స్ ఫర్డ్ ఐఐటి & మెడికల్ అకాడమీ జూనియర్ కాలేజీ ఆవరణలో మంగళ వారం విద్యాసంస్థల డైరెక్టర్ బెజవాడ నరేంద్ర బాబు జన్మదిన వేడుకలు విద్యార్థులు, ఉపాధ్యాయులు, యాజమాన్య సిబ్బంది మధ్య అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా కాలేజీలోని వివిధ క్యాంపస్ తరగతి గదులలో విద్యార్థిని, విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి కేకులు కట్ చేసి తమ ప్రియతమ డైరెక్టర్ కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. కళాశాల ప్రాంగణంలో బాణసంచా కాల్చి విద్యార్థులు తమ అభిమానాన్ని చాటుకున్నారు. అనంతరం డైరెక్టర్ బెజవాడ నరేంద్ర బాబు మాట్లాడుతూ.. తనపై ఇంతటి అపారమైన అభిమానాన్ని చూపి, జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ప్రతి విద్యార్థి కష్టపడి చదివి రానున్న పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించాలని, ఉన్నత శిఖరాలను అధిరోహించి తమ తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బి.ఆర్.ఆక్స్ ఫర్డ్ విద్యాసంస్థల చైర్మన్ ఉన్నం భాస్కరరావు, కరస్పాండెంట్ బండి వెంకటేశ్వర్లు, డైరెక్టర్ జి.బాల భాస్కరరావు, వివిధ విభాగాల ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొని నరేంద్ర బాబుకు ఘనంగా జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

## తలసేమియా బాధితులకు అండ





**కావలి,కలంకౌంటర్ :** స్థానిక తలసేమియా డే-కేర్ సెంటర్‌ను సింహాద్రి జ్యువెలర్స్ అధినేతలు, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్టాఫ్ యూనియన్ కావలి ప్రతినిధులు, పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు సంయుక్తంగా సందర్శించారు. రక్తహీనతతో పోరాడుతున్న తలసేమియా చిన్నారుల (వారియర్స్) ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, వారికి అవసరమైన నిత్యావసర సాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా సింహాద్రి జ్యువెలర్స్ ప్రతినిధులు ప్రకాష్, జగన్ తో పాటు ఎస్బీఐ స్టాఫ్ యూనియన్ నాయకులు శ్రీనివాసులు రెడ్డి, సుమన, జ్యోత్స్న, హరిబాబు, రహీమ్ బాషా, పెన్షనర్స్ నాయకులు టి. శ్రీనివాసరావు తదితరులు చిన్నారులను పరామర్శించారు. బాధితులకు అవసరమైన మందులు, పౌష్టికాహార కిట్లు, ఆర్థిక విరాళాన్ని అందజేశారు.

## ఏపీ మహిళలకు చంద్రబాబు గుడ్ న్యూస్... ఏసీ బస్సుల్లోనూ ఉచిత ప్రయాణం

**అమరావతి, కలంకౌంటర్ :** ఆంధ్రప్రదేశ్ మహిళలకు ముఖ్యమంత్రి చంద్రబాబు తీపి కబురు అందించారు. రాష్ట్రంలో త్వరలో పెద్ద ఎత్తున అందుబాటులోకి రానున్న ఏసీ బస్సుల్లోనూ మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించనున్నట్లు ఆయన వెల్లడించారు. మొగల్తూరులో నిర్వహించిన 'ఎన్టీఆర్ భరోసా' సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ముఖ్యమంత్రి ఈ కీలక ప్రకటన చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రం వేగంగా అభివృద్ధి పథంలో పయనిస్తోందని పేర్కొన్నారు. సంక్షేమంతో కూడిన అభివృద్ధే తమ ప్రభుత్వ విధానమని ఆయన స్పష్టం చేశారు. ఇప్పటివరకు పింఛన్ల రూపంలోనే ప్రజలకు రూ. 73,000 కోట్లు అందించినట్లు గుర్తుచేశారు. మహిళలు సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని, వారి కష్టాలను తీర్చేందుకే 'దీపం' పథకాన్ని తీసుకువచ్చామని వివరించారు. ఇదే సమయంలో గత వైసీపీ ప్రభుత్వంపై ఆయన తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. మెగా డీఎస్సీని అడ్డుకోవాలనే లక్ష్యంతో ఏకంగా 350 కేసులు వేశారని ఆరోపించారు.

## నేడు అంగరంగ వైభవంగా జనసేనాని జన్మదిన వేడుకలు

● సేవా కార్యక్రమాలు, భారీ ర్యాలీ ● 5 వేల మందికి విందు

**మచిలీపట్నం,కలంకౌంటర్ :** జనసేన పార్టీ అధినేత, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలకు మచిలీపట్నం నగరం లక్ష్మీ టాకీస్ సెంటర్ నందు సిద్ధమవుతోంది. జనసేన నాయకుడు కొట్టే వెంకట్రావు ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలను వినూత్నంగా, ఘనంగా నిర్వహించేందుకు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. జన్మదిన వేడుకలను కేవలం సంబరాలకే పరిమితం చేయకుండా సేవా కార్యక్రమాలతో నిర్వహించేందుకు నిర్వాహకులు ప్రణాళిక రూపొందించారు. ఇందులో భాగంగా నేడు ఉదయం మచిలీపట్నంలోని పలు ఆసుపత్రులను సందర్శించి రోగులకు పండ్లను పంపిణీ చేయనున్నారు.

**ట్రాక్టర్లతో రైతుల సందడి.. బైకులు, కార్లతో భారీ ర్యాలీ..** పవన్ కళ్యాణ్‌పై అభిమానంతో రైతులు ట్రాక్టర్లతో ర్యాలీలో పాల్గొననున్నారు. యువత, జనసేన పార్టీ కార్యకర్తలు, నాయకులు, వీర మహిళలు బైకులు, కార్లతో ర్యాలీలో పాల్గొని జన్మదిన వేడుకల సందడిని మరింత పెంచనున్నారు. మధ్యాహ్నం 3 గంటలకు జిల్లా పరిషత్ సెంటర్ నుంచి ర్యాలీ ప్రారంభం కానుంది. చీరలపూడి, పరాస్‌పేట, చిన్నాపురం, హాస్పిటల్, కోనేరు సెంటర్, రేవతి సెంటర్, జిల్లా పరిషత్ సెంటర్ మీదుగా లక్ష్మీ టైప్ సెంటర్ వరకు ర్యాలీ కొనసాగనుంది. ర్యాలీని క్రమశిక్షణతో నిర్వహిస్తూ ప్రజలకు, వాహనదారులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

**పారిశుద్ధ్య కార్మికులకు గౌరవం..** మచిలీపట్నం మున్సిపాలిటీ పరిధిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికుల మహిళలకు చీరల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ప్రజల ఆరోగ్యం, పరిశుభ్రత కోసం నిరంతరం సేవలందిస్తున్న పారిశుద్ధ్య కార్మికులను గౌరవించడంలో భాగంగానే ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. సాయంత్రం కేక్ కటింగ్.. 5 వేల మందికి విందు సాయంత్రం 6 గంటలకు కేక్ కటింగ్ కార్యక్రమం నిర్వహించనున్నారు. అనంతరం సుమారు 5 వేల మందికి భారీ డిన్నర్ ఏర్పాటు చేశారు. సేవా కార్యక్రమాలు, రైతులు--యువత భాగస్వామ్యంతో భారీ ర్యాలీ, పారిశుద్ధ్య కార్మికులకు గౌరవం, అనంతరం సామూహిక విందుతో పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలను మచిలీపట్నంలో ఘనంగా నిర్వహించేందుకు కొట్టే వెంకట్రావు ఏర్పాట్లు చేస్తున్నారు. జనసేనాని జన్మదిన వేడుకలు మచిలీపట్నంలో అభిమానులు, పార్టీ శ్రేణులకు పండుగ వాతావరణాన్ని తీసుకురానున్నాయి. ఈ సమావేశంలో జనసేన నాయకులు శాయన శివయ్య, వాలిశెట్టి మల్లి, చిలంకుర్తి పృధ్వి ప్రసన్న, డాక్టర్ మాధవి తదితరులు పాల్గొన్నారు









Printed,Published and owned by Chitta Vasavidevi Printed at Rama Offset Printers, 7th ward, Ponnuru, Guntur District-522 124 Andhra Pradesh and Published at 7th ward, Ayyappa Nagar, Ponnuru-522 124, Guntur District. Andhra Pradesh. Editor : Chitta Vasavidevi. RNI No.APTEL/2016/69464, Phone No.9346935672, kalamcounter@gmail.com